క్లుప్తంగా

ఉపవాస దీక్షలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి



గుడివాడ టౌన్: ముస్లింలు పవిత్ర రంజాన్‌మాసం ప్రారంభం సందర్భంగా ఉపవాస దీక్షలు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) పేర్కొన్నారు. అల్లా దీవెనలు ప్రతి ఒక్కరిపై ఉండాలని, ప్రజలు సుభిక్షంగా ఉండాలని తాను కోరుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో విద్యార్థుల సత్తా

కోసూరు(మొవ్వ): హైదరాబాద్ ఎల్బీ నగర్ స్టేడియంలో న్యూ డ్రాగెన్ ఫైటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 3వ ఇంటర్నేషనల్ ఆల్ స్టైల్స్ మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో తమ విద్యార్థులు సత్తా చాటినట్లు మొవ్వ మండలం కోసూరు గ్రామంలోని శ్రీ సన్‌ఫ్లవర్ హైస్కూల్ యాజమాన్యం జోసెఫ్ తెలిపారు. ఈ పోటీల్లో 13 మంది విద్యార్థులు గోల్డ్ మెడల్స్, నలుగురు సిల్వర్, నలుగురు బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు పేర్కొన్నారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ ఎండీవీఎస్ఆర్ పున్నం రాజే, హెచ్ఎం అభినందించారు.

స్పందనకు ఎనిమిది దరఖాస్తులు

గుడివాడ టౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎనిమిది దరఖాస్తులు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ జి.బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఆయా సమస్యలను సంబంధిత అధికారుల ద్వారా వెంటనే పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.

గ్రామాల అభివృద్ధే సీఎం జగన్ లక్ష్యం



కలిదిండి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాన లక్ష్యం గ్రామాల అభివృద్ధేనని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. పెటకలిదిండిలోని దేవునితోటలో రూ.10 లక్షల పంచాయతీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను నాయకులతో కలిసి ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, సర్పంచ్ మసీముక్కు మారుతి ప్రసన్న, ఏఎంసీ చైర్మన్ కొల్లాటి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తిరుమాని రమేష్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ పాము రవికుమార్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వండి

గుడివాడ టౌన్: స్థానిక నెహ్రూచౌక్‌లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కృష్ణా జిల్లా బీఎస్పీ ఇన్‌చార్జ్ దారం కరుణాకర్ కోరారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆయన ఆర్డీఓ పి. పద్మావతికి సోమవారం వినతిపత్రం సమర్పించారు. స్థానిక కోతిబొమ్మ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఫ్లై ఓవర్ నిర్మాణ కారణంగా తొలగిస్తున్న నేపథ్యంలో ప్రధాన కూడలి అయిన నెహ్రూచౌక్ సెంటర్‌లో కొత్త విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఆర్డీఓ మాట్లాడుతూ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామన్నారు. బీఎస్పీ నాయకులు గోపీనాయక్, జయరాజు, బాబి, మురళీకృష్ణ, నరేష్ పాల్గొన్నారు.

రామేశ్వరుని హుండీ ఆదాయం రూ. 3.04 లక్షలు

తోట్లవల్లూరు: ఐలూరులోని శ్రీగంగా పార్వతీ సమేత శ్రీరామేశ్వరస్వామి హుండీ ద్వారా రూ. 3.04 లక్షలు లభించింది. ఆలయ ప్రాంగణంలో ఫెస్టివల్ అధికారి ఎస్వీ సుబ్బారావు ఆధ్వర్యంలో సోమవారం హుండీలను లెక్కించారు. హుండీల ద్వారా రూ.3.04 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ జయశ్రీ తెలిపారు.

హుండీ కానుకల లెక్కింపు

కలిదిండి: భోగేశ్వరలంకలోని పార్వతీ సమేత పాతాళ భోగేశ్వరస్వామి ఆలయ హుండీ కానుకల లెక్కింపును సోమవారం నిర్వహించినట్లు ఆలయ ఈఓ శ్రీనివాసరావు తెలిపారు. ఏలూరు జిల్లా దేవదాయ తనిఖీ అధికారి సుధాకర్ పర్యవేక్షణలో ఈ లెక్కింపు జరిగిందన్నారు. మహాశివరాత్రి సందర్భంగా స్వామికి రూ.25,89,979 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఆలయ ధర్మకర్తల మండల సభ్యులు బలరామరాజు, కూచిపూడి సుబ్బలక్ష్మీ, పీఏసీఎస్ చైర్మన్ వడుపు రామారావు, చిట్టూరి శ్రీనివాసరావు, ఆలయ అర్చకులు ఐలూరి ఉమా శంకర్ శర్మ పాల్గొన్నారు.

శాస్త్రీయ పద్ధతిలో లేగ దూడలను పెంచాలి

కలిదిండి: పాడి రైతులు శాస్త్రీయ పద్ధతిలో లేగ దూడలను పెంచడం ద్వారా అధిక లాభాలు ఆర్జించవచ్చని ఏలూరు జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ గెద్దం నెహ్రూబాబు అన్నారు. దూడల ప్రదర్శన, పశువులలో గర్భకోశవ్యాధి నివారణ కార్యక్రమాన్ని సానారుద్రవరంలో కైకలూరు పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు ముస్తాఫాఖాన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. నెహ్రూబాబు మాట్లాడుతూ పాడి పశువులకు సకాలంలో కృత్రిమ గర్భధారణ చేసినట్లయితే మేలు జాతి దూడలు జన్మిస్తాయన్నారు. సానారుద్రవరం, పరిసర గ్రామాల నుంచి 31 దూడలు ప్రదర్శనకు వచ్చాయి. గర్భకోశ వ్యాధి నివారణ శిబిరానికి 45 పాడి పశువులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. దూడల పెంపకంలో ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటున్న రైతులకు బహుమతులను అందజేశారు. ఏలూరు డివిజన్ ఉప సంచాలకులు గోవిందరాజు, పశుగణాభివృద్ధి సంస్థ గన్నవరం కార్యనిర్వహణాధికారి శ్రీనివాస్, డాక్టర్ ఫణీంద్ర, సర్పంచ్ నున్న రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నింటినీ అమలు చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్

గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

నందివాడ: ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) పేర్కొన్నారు. నందివాడలోని కొండపల్లి కన్వెన్షన్‌లో నాలుగో విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో సోమవారం ఎమ్మెల్యే కొడాలి నాని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు కందుల నాగదుర్గాకుమారి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలోని 2,322 మంది అక్కచెల్లెమ్మలకు మంజూరైన రూ.4,37,37,500 ఆసరా చెక్కులను ప్రజాప్రతినిధులతో కలసి ఎమ్మెల్యే నాని అందజేశారు. అనంతరం మహిళలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి థాంక్యూ సీఎం సార్, జిందాబాద్ ఎమ్మెల్యే కొడాలి నాని అంటూ నినాదాలు చేశారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన వాగ్దానాలనే కాక ప్రజల కోసం చేసిన మంచిని చూసి తనను గెలిపించండని ప్రజల ముందుకు వస్తున్న జగన్‌కు మద్దతుగా ప్రజలందరూ ఉండాలని కోరారు. మోసపూరిత వాగ్దానాలతో మళ్లీ ఎన్నికల్లోకి వస్తున్న చంద్రబాబు మాటలను ఎవరూ నమ్మవద్దని సూచించారు. మరోసారి వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకొచ్చి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని ప్రజలను ఎమ్మెల్యే కొడాలి నాని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పెయ్యల ఆదాం, వైఎస్సార్ సీపీ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, పాలడుగు రామ్‌ప్రసాద్, గిరిబాబాయ్, పాలేటి చంటి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మెరుగుమాల కాళీ, వైస్ ఎంపీపీలు పూడి సుధాకర్, జయరాజు, సర్పంచ్ సరేళ్ల రత్నకుమారి, ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులు చైతన్యజ్యోతి, గుత్తా చిన్ని, ఆయా గ్రామాల సర్పంచ్‌లు ప్రసాద్, నత్త మరియమ్మ, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ కొండపల్లి కుమార్ రెడ్డి, నాయకులు తోట నాగరాజు, కందుల నాగరాజు, చంద్రశేఖర్‌రెడ్డి, రంగారెడ్డి, బూత్ కన్వీనర్ గొల్లపూడి చంద్రశేఖర్, నాగేశ్వరరావు, శ్రీను, రాజులపాటి చంద్రశేఖర్, కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, రామ్మోహనరెడ్డి, నీలాకాంత్, రవి, అజయ్, అశోక్, సాగర్, కలపాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మహిళలకు ఆసరా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

సంక్షేమరాజ్యం సీఎం జగన్‌తోనే సాధ్యం

పామర్రు ఎమ్మెల్యే అనిల్‌కుమార్



వైఎస్సార్ చేయూత చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

తోట్లవల్లూరు: రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆయన సోమవారం విస్తృతంగా పర్యటించి రూ.1.31 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు నిర్వహించడంతోపాటు వైఎస్సార్ చేయూత లబ్ధిదారులకు రూ.5.49 కోట్ల చెక్కును అందజేయడంతోపాటు వలంటీర్లకు పురస్కారాలను ప్రదానం చేశారు. తొలుత వల్లూరుపాలెంలో జగనన్న లేఅవుట్‌ను ఎమ్మెల్యే అనిల్‌కుమార్ సందర్శించి పరిశీలించారు. కాలనీ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై తహసీల్దార్ కుసుమకుమారి, ఎంపీడీఓ సత్యనారాయణ, పీఆర్ డీఈ శ్రీనివాసరావు, స్థానిక నాయకులతో చర్చించారు. చాగంటిపాడులో వెల్‌నెస్ సెంటర్, సీసీ రోడ్లు, భద్రిరాజుపాలెంలో సీసీ రోడ్లు, తోట్లవల్లూరు ఉర్దూ పాఠశాలలో నాడు–నేడు పనులు, దేవరపల్లిలో రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్, గురివిందపల్లిలో పంచాయతీకార్యాలయం, సీసీ రోడ్లు, రొయ్యూరులో పీఏసీఎస్ గోదామును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం వైఎస్సార్ చేయూత కింద రూ. 5.49 కోట్ల చెక్కును మహిళలకు అందజేశారు. వలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులను అందజేశారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్ రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు రాధిక, లక్ష్మి, హేమలత, వెంకటేశ్వరరావు, ఉదయభాస్కర్, ప్రభుదాస్, ఎంపీడీఓ సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యురాలు అనురాధ, వైస్ ఎంపీపీలు శివారెడ్డి, వెంకటేశ్వరరావు, నాయకులు రామచంద్రరావు, శ్రీనివాసరావు, రాజేంద్ర, శేషిరెడ్డి, గవాస్కర్‌రాజు పాల్గొన్నారు.

నివేశన స్థలాలను మెరక చేయించాలి

మండవల్లి: నివేశన స్థలాలు మెరక చేయించి పేదల సొంత ఇంటి కలను నెరవేర్చాలని ఐక్య వేదిక జిల్లా కార్యదర్శి ఎల్ఎస్ భాస్కరరావు, మండల అధ్యక్షుడు టి.అప్పారావు, బుద్ధుల రాముడు, లబ్ధిదారులు కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమంలో ఏఓ కె.గోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. స్థానిక తరుగుమూలన 18 ఏళ్ల క్రితం లోతట్టు ప్రదేశంలో 118 మంది లబ్ధిదారులకు ఇచ్చిన నివేశన స్థలాలను ప్రభుత్వం తక్షణమే మెరక చేయించాలన్నారు. ఏడుకొండలు, రామారావు, దావీదు, చిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన

ముదినేపల్లి రూరల్: మండలంలోని బొమ్మినంపాడులో ఎయిడ్స్ నివారణపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. చైల్డ్ ఫర్ లింక్ వర్కర్స్ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. లింక్ వర్కర్ జన్ను చంద్రావతి మాట్లాడుతూ ఎయిడ్స్ బాధితులపై సానుభూతితో ఇతరులు వ్యవహరించాలని కోరారు. హెచ్ఐవీ ప్రాణాంతకం కాదని, మందులతో జీవతకాలం పొడిగించుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా క్షయవ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ వ్యాధి లక్షణాలను వివరించి చికిత్స వివరాలు తెలియజేశారు.

ప్రకృతి సాగు కూరగాయల విక్రయం

ముదినేపల్లి రూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు, కూరల విక్రయాలు సోమవారం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ సీఆర్పీ గౌతమ్ కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని బొమ్మినంపాడు, కొరగుంటపాలెం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో కూరగాయ తోటలు సాగుచేస్తున్నారు. ఈ తోటల నుంచి వచ్చిన కూరలతో పాటు గిరిజన కార్పొరేషన్ నుంచి సేకరించిన బెల్లం, పసుపు, ఇతర ఉత్పత్తులను ప్రతి సోమవారం విక్రయిస్తున్నారు. ఈ ఉత్పత్తులకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తున్నట్లు గౌతమ్‌కుమార్ తెలిపారు.

కైకలూరు సీహెచ్‌సీకి డయాలసిస్ సెంటర్ మంజూరు



సీహెచ్‌సీలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుపై సంస్థ ప్రతినిధితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. కైకలూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో ఐదు పడకల డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు అవసరమైన గదులను రహీ కేర్ సంస్థ ప్రాజెక్టు ప్రతినిధికి సోమవారం అప్పగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డయాలసిస్ చేయించుకునేందుకు నియోజకవర్గ ప్రజలు విజయవాడ, ఏలూరు, భీమవరం వంటి ప్రాంతాలకు వ్యయప్రయాసలతో వెళుతున్నారన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన ఆదేశాలతో రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ జె.నివాస్ ప్రత్యేక దృష్టిసారించి డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు అనుమతులు ఇచ్చారన్నారు. త్వరలో రహీ కేర్ సంస్థ డయాలసిస్ పరికరాలు, వైద్య సిబ్బందితో సెంటర్‌ను ఏర్పాటు చేస్తారన్నారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గాప్రసాద్, ఎంపీపీ అడవి కృష్ణ, సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు దూలం వీరశ్యామ్ ఫణికుమార్, ఏలూరు జిల్లా ముస్లిం మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ రఫీ పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రజా ఆశీర్వాదయాత్రలు

మండవల్లి: సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని అయ్యవారిరుద్రవరం, అప్పాపురం గ్రామాల్లో సోమవారం 21వ రోజు ప్రజా ఆశీర్వాదయాత్ర కార్యక్రమాలు కొనసాగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ (జేవీఆర్) అయ్యవారిరుద్రవరంలో అంతర్గత సీసీ రోడ్లు, సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. పార్లమెంట్ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్‌ను, ఎమ్మెల్యే డీఎన్నార్‌ను దీవించాలని కోరారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, పార్టీ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు బుర్ల భోగేశ్వరరావు, బోనం శేషగిరి పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చర్యలు


గుడివాడరూరల్: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే లా పోలీస్‌శాఖ అన్ని చర్యలు చేపడుతోందని గుడివాడ తాలూకా సీఐ కె.ఏసుబాబు పేర్కొన్నారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన బొమ్ములూరు, శేరీదింటకుర్రు, చౌటపల్లి, మోటూరు, దొండపాడు, శ్రీకాళహస్తీకాలనీ గ్రా మాల్లో కేంద్ర బలగాలతో ప్రజలకు అవగాహన కల్పించేందుకు కవాతును సోమవారం నిర్వహించారు. సీఐ మా ట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు గుడివాడ డీఎస్పీ పి.శ్రీకాంత్ పర్యవేక్షణలో రానున్న ఎన్నికల్లో ప్రజలు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కు వినియోగించుకునేలా పోలీస్ శాఖ అన్ని రకాల చర్యలు చేపడుతుందన్నారు. సీఐఎస్ఎఫ్–287 విభాగానికి చెందిన 92మంది కేంద్ర బలగాలతో అన్ని ప్రాంతాల్లో కవాతు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. ఏఎస్ఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

అడ్డాడ(పామర్రు): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏపీ ఎస్‌జీసీ రాష్ట్ర పర్యవేక్షణ కో–ఆర్డినేటర్ జి.ప్రభావతి పేర్కొన్నారు. మండలంలోని అడ్డాడ గ్రామంలో అరవింద ఇంటిగ్రల్ హైస్కూల్‌ను సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ, గ్రీన్ కోర్ అనే అంశాలపై ప్రతిఒక్కరూ తప్పని సరిగా అవగాహన కల్గిఉండాలన్నారు. గాలి, జల కాలుష్యాల వలన జీవ జీవనం అస్త వ్యస్తమవుతోందని, దీనిని నివారించేందుకు ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాలుష్య రహిత సమాజం కోసం అందరం కలిసి ప్రతిఇంట్లో ఒక మొక్కను పెంచాలన్నారు. మొక్కలను నాటటమే కాకుండా దాని నిర్వహణ బాధ్యతలను స్వీకరించాలన్నారు. వాతావరణంలోని కాలుష్యాన్ని నివారించేందుకు పచ్చని మొక్కలను పెంచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ విద్యను అన్ని పాఠశాలల్లో తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అరవింద హైస్కూల్ ప్రిన్సిపాల్ రమణమూర్తి, జిల్లా పర్యావరణ కో–ఆర్డినేటర్ కె.అన్నపూర్ణ, పామర్రు ఎంఈఓ–2 పద్మవాణి పాల్గొన్నారు.

సీతారామస్వామి దేవస్థానానికి నూతన పాలకవర్గం ఏర్పాటు

గుడివాడరూరల్: అపరభద్రాద్రిగా పేరుగాంచిన మోటూరు శ్రీసీతారామస్వామి దేవస్థానానికి నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారాన్ని దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో సోమవారం నిర్వహించారు. దేవస్థానం చైర్మన్‌గా వంశపారపర్య ధర్మకర్తలు కొనసాగుతారని, సభ్యులుగా జి.కొండయ్య, సి.గోపినాథ్, డి.వీరాంజనేయులు, ఎం.రుక్మిణి, కె.వాణి, సి.రామాంజమ్మ, టి.రామకృష్ణలచే రామాలయంలో దేవదాయశాఖ గుడివాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ ప్రమాణస్వీకారోత్సవాన్ని నిర్వహించారు. అదే విధంగా నాగేశ్వరస్వామి దేవస్థానం ఆలయ చైర్మన్‌గా వడ్డీ శాస్త్రులు, సభ్యులుగా గంటా శ్రీనివాసరావు, జి.వెంకటేశ్వరరావు, ఆర్.రామాంజమ్మ, ఎం.లీలావతి, డి.సీతారావమ్మ, ఎ.సరళ, పి.దుర్గశ్రీనివాసరావుతో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఆయా కార్యక్రమాల్లో మోటూరు గ్రూప్ దేవాలయ ఈఓ గౌరిపర్తి నాగమౌనిక, పీఏసీఎస్ అధ్యక్షుడు ఇమ్మడి అశోక్, వైఎస్సార్ సీపీ నాయకుడు కొరగంటి పండు తదితరులు పాల్గొన్నారు.



రామాలయం పాలకవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సుధాకర్



ప్రమాణస్వీకారం చేసిన నాగేశ్వరస్వామి దేవస్థాన నూతన చైర్మన్, పాలకవర్గ సభ్యులు

వైఎస్సార్ సీపీని ఆశీర్వదించండి



పొద్దువాకలో ఎన్నికల ప్రచారం చేస్తున్న దూలం స్వాతి

ముదినేపల్లి రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను ఆశీర్వదించి ఘన విజయం చేకూర్చాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) కోడలు స్వాతి, పార్టీ మండల నాయకులు కోరారు. మండలంలోని ప్రొద్దువాకలో కైకలూరు అసెంబ్లీ, ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గాల అభ్యర్థులైన దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), సునీల్ కుమార్ యాదవ్ తరపున ప్రచారాన్ని సోమవారం నిర్వహించారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, సర్పంచ్ సింగనపల్లి రామకృష్ణ, అల్లూరి సర్పంచ్ శీలం రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీలు చొప్పర్ల సునీత, రాచూరి రాధా, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మోత్రు ఏసుబాబు, నాయకులు కోమటి విష్ణువర్ధన్, బొర్రా శేషుబాబు, పేర్ని పృథ్వీ పాల్గొన్నారు.

ఎన్నికల బాండ్ల వివరాలు వెల్లడించాలి

గుడివాడ టౌన్: దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆదేశానుసారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎన్నికల బాండ్ల వివరాలను వెంటనే బహిర్గతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్ వద్ద సీపీఎం ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఎన్నికల బాండ్ల వివరాల సమాచారం ఎలక్షన్ కమిషన్‌కు అందజేయాలని సుప్రీంకోర్టు ఆదేశించినా ఎస్‌బీఐ వివిధ శాఖల వద్ద సమాచారం ఉందని, 113 రోజులు సమయం కావాలని కోరడం కోర్టు తీర్పు ధిక్కారం కింద వస్తుందన్నారు. అతిపెద్ద డిజిటల్ సౌకర్యాలు కల్గిన స్టేట్‌బ్యాంక్ జూన్ 31 వరకు గడువు కావాలని కోరడం ఎంతవరకు సబబన్నారు. ఎన్నికల బాండ్ల వివరాలు బయటకు వస్తే కేంద్ర ప్రభుత్వ అవినీతి బయటపడుతుందని ప్రధాని మోదీ ఒత్తిడి మేరకే ఎస్‌బీఐ వివరాలు ప్రకటించడం లేదని ఆరోపించారు. సీపీఎం సభ్యులు పి. రజిని, టి. లక్ష్మణరావు, ఆర్. కొండ, పి. ప్రభుదాసు, కె. వెంకటేశ్వరరావు, జీఎస్. కుమారి, పి. వీరమ్మ, జి. ఎలీషారావు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు పెద్దపీట

ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు, మహిళలు

కలిదిండి: మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక చర్యలతో మహిళలు ఆర్థిక స్వాతంత్ర్యం సాధిస్తున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలో వైఎస్సార్ చేయూత నాలుగో విడత కార్యక్రమం సోమవారం జరిగింది. ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ నాయకులతో కలిసి రూ.7 కోట్ల 55 లక్షల నమూనా చెక్కును మహిళలకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్కచెల్లెమ్మల ఆర్థికాభివృద్ధి కోసం వివిధ పథకాలను అమలు చేస్తూ లక్షలాది మంది మహిళలకు ఆర్థికంగా ఆసరా అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ చేయూత పథకం కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళల జీవనోపాధి నిమిత్తం ఒక్కొక్కరికి రూ.18,750 చొప్పున అందిస్తూ రూ.75 వేలను అందించారన్నారు. మహిళా సాధికారతే లక్ష్యంగా పాలన చేస్తున్న జగన్‌ను మహిళలందరూ ఆశీర్వదించాలని కోరారు. అనంతరం నాయకులు, మహిళలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యులు బొర్రా సత్యవతి, వైస్ ఎంపీపీలు కూసంపూడి కనక దుర్గారాణి, కట్టా నాగలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ కొల్లాటి సత్యనారాయణ, సర్పంచ్ మసీముక్కు మారుతీ ప్రసన్న, ఎంపీటీసీ సభ్యులు షఫాయితుల్లా, నీలి సుమన్, వ్యవసాయ సలహా మండలి మండల అధ్యక్షురాలు దనికొండ మరియమ్మ పాల్గొన్నారు.

తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయొద్దు



వాటర్ కూలర్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ తదితరులు

గుడివాడ టౌన్: నవమాసాలు మోసి కని పెంచి పెద్దజేసిన తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయడం దుర్మార్గమని మున్సిపల్ కమిషనర్ జి.బాలసుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక మందపాడులోని నిరాశ్రయ కేంద్రంలో మెప్మా, రాజా రూరల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసి నిరాశ్రయ కేంద్రంలోని వృద్ధులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ జన్మనిచ్చిన తల్లిదండ్రులను వదిలించుకోవాలని కొందరు చూస్తున్నారని అది హేయమైన చర్య అన్నారు. అనంతరం వేసవిలో వృద్ధుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన వాటర్ కూలర్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సిటీమిషన్ మేనేజర్ జీఎస్ సత్యవతి, టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు మాదాసు వెంకట లక్ష్మీకుమారి, డాక్టర్ కెజియా రాణి, ఎన్జీఓ అంకపల్లి పురుషోత్తం పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయం



విలేజ్ హెల్త్‌క్లినిక్‌ను ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కొడాలి నాని

నందివాడ: సంక్షేమ పథకాలతో పేదరిక నిర్మూలనే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) పేర్కొన్నారు. మండలంలోని కుదరవల్లి గ్రామంలో రూ.1.14 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో సోమవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే కొడాలి నానికి వైఎస్సార్ సీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రూ.16 లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే కొడాలి నాని భూమి పూజ చేశారు. అనంతరం సచివాలయం, ఆర్‌బీకే కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ప్రజాప్రతినిధులతో కలసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛమైన పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలందరూ మద్దతుగా నిలవాలని కోరారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లను ఎమ్మెల్యే కొడాలి నాని ఘనంగా సత్కరించి సన్మానించారు. వైఎస్సార్ సీపీ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, పాలడుగు రామ్‌ప్రసాద్, గిరిబాబాయి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మెరుగుమాల కాళీ, ఎంపీపీ పెయ్యల ఆదాం, జెడ్పీటీసీ సభ్యురాలు కందుల నాగదుర్గాకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు తోట నాగరాజు, కందుల నాగరాజు, తమ్మినేని రోమేశ్వరరావు, చింతాడ నాగూర్, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ కొండపల్లి కుమార్, పంచాయతీరాజ్ డీఈ హరనాథ్‌బాబు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేయండి



ఎమ్మెల్యే కొడాలి నానీని కలిసిన నూతన పాలకవర్గ సభ్యులు

గుడివాడ టౌన్: ప్రభుత్వం పాలక మండలి సభ్యులపై నమ్మకంతో ఆలయ పరిపాలన అప్పగిస్తుందని దానిని బాధ్యతగా వ్యవహరించాలని గుడి వాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. సోమవారం స్థానిక రాజేంద్రనగర్‌లోని ఆయన నివాసంలో నూతనంగా నియమించిన శ్రీ భీమేశ్వరస్వామి వారి దేవస్థానం పాలక మండలి సభ్యులు ఎమ్మెల్యే కొడాలి నానీని మర్యాద పూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ దేవుని సేవ చేయడం పవిత్రమైన కార్యక్రమాల్లో ఒకటన్నారు. ప్రతి ఒక్కరూ భక్తి శ్రద్ధలతో భగవంతుని సేవచేసి ఆయన కృపకు పాత్రులు కావాలన్నారు. కార్యక్రమంలో నూతన పాలక మండలి సభ్యులు పంచకర్ల వెంకట్, పాదిలి సత్యనారాయణ, ఆత్మకూరి రంగామణి, గానుగుల సరళరేఖ, దారం కాంచనకుమారి, నూకల లక్ష్మీ శివజ్యోతి, చందల వజ్రలత, లక్కోసి శివప్రసాద్, ఆల య అభివృద్ధి కమిటీ చైర్మన్ చందరాల హరిరాం బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు పాలేటి చంటి, వెంపల అప్పారావు, జ్యోతుల శ్రీను పాల్గొన్నారు.

నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం

స్థానిక మార్కెట్ సెంటర్‌లోని శ్రీ దేవరకొండ నాగన్న బ్రాహ్మణ అన్నదాన సత్రం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం మంగళవారం ఉదయం 10 గంటలకు సత్రం ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు నండూరి ఉమాశంకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రతి ఇంటికీ సోలార్ ప్యానల్స్

గుడివాడ టౌన్: ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకం ద్వారా ప్రతి ఇంటికి సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసి 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని గుడివాడ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ రావూరి ఫణి ప్రసాద్ పేర్కొన్నారు. పోస్టల్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సోలార్ ప్యానల్ యొక్క జీవితకాలం 25 సంవత్సరాలు ఉంటుందని, ఒక కేవీ సోలార్ ప్యానల్ ఇన్‌స్టాల్ చేసేందుకు రూ.55 వేల నుంచి రూ.65 వేలు వరకు ఖర్చు ఉంటుందన్నారు. ఈ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నుండి సబ్సిడీ కూడా ఉంటుందని తెలిపారు. ఈ ప్యానల్ ఏర్పాటు చేయదలచుకున్న వారు తమ సమీపంలోని పోస్టల్ కార్యాలయంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్‌కోసం వినియోగదారుని ఫోన్ నంబర్, ఆరు నెలల విద్యుత్ బిల్లులు ఇవ్వాలన్నారు. మొదటి విడతగా కోటి మందికి సబ్సిడీ కల్పించనున్నారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 08674–245056లో సంప్రదించవలసిందిగా కోరారు.

శివాలయంలో అన్నసమారాధన

తోట్లవల్లూరు: స్థానిక భ్రమరాంబ చెన్నమల్లికార్జునస్వామి ఆలయంలో సోమవారం శివరాత్రి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని అధికారులు అన్నసమారాధన నిర్వహించారు. పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, ఆలయ ఈఓ హరిదుర్గా నాగేశ్వరరావు, గుమ్మస్తా శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

బీఎస్సార్‌కు సన్మానం

మండవల్లి: అఖిల భారతీయ యాదవ మహాసభ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువజన అధ్యక్షుడిగా ఎన్నికైన బూరుబోయిన శ్రీనివాసరావు (బీఎస్సార్)ను లోకుమూడిగరువులో కార్యాలయం వద్ద సోమవారం ఘనంగా సన్మానించారు. ఆయన యువజన అధ్యక్షుడిగా ఆదివారం విజయవాడ కార్యాలయంలో నియామక ఉత్తర్వులను రాష్ట్ర అధ్యక్షుడు వెంగళరావు నుంచి అందుకున్న విషయం విదితమే. యశ్వంత్, సాయి, సాగర్, నాగశ్రీను, గెద్దం రాజేష్, నాగరాజు, మసిముక్కల ఫణి, సాయికృష్ణ, బోయిన స్వామి బీఎస్సార్‌ను సన్మానించారు.